సాక్షి తిరుపతి
శుక్రవారం । 17 । నవంబర్ । 2023



పంచమి తీర్థానికి ఏర్పాట్లు

కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 18వ తేదీన జరగనున్న పంచమి తీర్థానికి పటిష్ట ఏర్పాట్లు చేపట్టినట్టు టీటీడీ ఈఓ తెలిపారు. - 8లో



దొంగల బీభత్సం

తిరుపతి నగరంలో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. మూడు ప్రాంతాల్లో బీభత్సం సృష్టించారు. - 8లో



రాజకీయ యుద్ధానికి సిద్ధం

ఎన్నికలకు ముందు నుంచే ప్రత్యక్ష రాజకీయ యుద్ధానికి సిద్ధమవుతున్నానని మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

ఆగమోక్తం.. ఆకాశదీపం



వెలుగుతున్న కార్తీక దీపం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం ఆకాదీపాన్ని ఆగమోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతిరోజూ ఆకాశదీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఆలయంలోని ఊంజల్ సేవా మండపం వద్ద ఏర్పాటు తేసిన కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 71,123 మంది స్వామివారిని దర్శించుకోగా.. 26,689 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.84 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 14 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.


నేడు నారాయణవనంలో స్పందన

నారాయణవనం: మండల కేంద్రంలోని సారకాయలస్వామి కల్యాణ మండపంలో శుక్రవారం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆధ్వర్యంలో జరిగే ఈ స్పందనలో జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, మండల అధికారులు పాల్గొంటారని, మండల ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

పెండింగ్ దరఖాస్తులు పూర్తిచేయండి

తిరుపతి అర్బన్: 2024 ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ నాటికి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పూర్తిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదేశించారు. గురువారం అమరావతి కార్యాలయం నుంచి అన్ని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఆర్‌ఓలు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఫారమ్ -7కు సంబంధించి 30 రోజులు దాటినవి 18,730, ఫారం -8 7,343 ఉన్నాయని, త్వరితగతిన పరిశీలించి నిర్దేశించిన సమయంలోపు పూర్తిచేస్తామని చెప్పారు. జీరో డోర్ నంబర్ల విషయంలో 6,882 ఉన్నట్లు గుర్తించి వాటిని పరిశీలించామని, ఇంకా 193 మాత్రం పెండిగ్‌లో ఉన్నాయని వెల్లడించారు. డీఆర్‌ఓ పెంచలకిషోర్, తిరుపతి, గూడూరు ఆర్‌డీఓలు నిషాంత్ రెడ్డి, కిరణ్‌కుమార్, కార్పొరేషన్ డీసీ చంద్రమౌళీశ్వరరెడ్డి, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ఎన్నికల సెక్షన్ తహసీల్దార్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలను పెంచండి



సమావేశంలో మాట్లాతున్న పీడీ శ్రీనివాసప్రసాద్

దొరవారిసత్రం: ఉపాధి పనులకు కూలీలను పెంచి ప్రతి ఒక్కరూ పనులకు వచ్చేలా చూడాలని ఉపాధి అధికారులకు డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సూళ్లూరుపేట నియోజకవర్గ స్థాయిలో అన్ని మండలాల ఏపీఓ, ఈసీ, ఎఫ్‌ఏ, మేట్లుతో ఉపాధి పనులపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా మండలాల్లో ఇప్పటివరకు జరిగిన పనులపై సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉపాధి పనులు చేయించడమే కూలీల సంఖ్య బాగా పెంచాలన్నారు. దీంతోపాటు పనులు సక్రమంగా జరిగేలా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. పనులు చేయించడమే కాకుండా ఉపాధి కూలీలకు నగదు సకాలంలో అందేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ రఘురామయ్య, ఉపాధి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభల తేజస్సు

సూర్యప్రభ వాహనంపై వేదనారాయణుడి అలంకరణలో పద్మావతీ అమ్మవారు



చంద్రప్రభ వాహనంపై దర్బార్ కృష్ణుడి అలంకరణలో అమ్మవారు





గోవింద..గోపాలా!



కళ..భళా



చంద్రప్రభ వాహన సేవలో కళాకారుల దేవతా రూపాలు

తిరుచానూరు(చంద్రగిరి) : శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఏడో రోజైన గురువారం రాత్రి అమ్మవారు చంద్రప్రభ వాహనంపై దర్బార్ కృష్ణుడి అలంకరణలో తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం 8 గంటలకు వేద నారాయణుడి అలంకరణలో అమ్మవారు సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ కనువిందు చేశారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఆలయంలో అమ్మవారికి నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం, సాయంత్రం 6గంటలకు ఆస్థాన మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. భక్తుల కోలాటాలు, భజన బృందాలు, మంగళవాయిద్యాలు, జియ్యర్ల ప్రబంధ పారాయణం నడుమ అమ్మవారు తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8.40గంటలకు ధనులగ్నంలో రథోత్సవం, రాత్రి 7గంటలకు అశ్వ వాహన సేవ జరగనున్నాయి. కార్యక్రమంలో తిరుమల పెద్ద, చిన్న జీయ్యర్ స్వాములు, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, జేఈఓ వీరబ్రహ్మం, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'చంద్రుడు'!

గురువారం రాత్రి జరిగిన చంద్రప్రభ వాహన సేవలో కళాకారుల దేవతా రూపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చంద్రప్రభ వాహనంపై అమ్మవారు భక్తులను కటాక్షిస్తుండగా వాహనం ముందు చంద్రుని వేష ధారణతో ఎస్వీ సంగీత నృత్య కళాశాల విద్యార్థిని వినిత్యా చౌదరి అలరించారు. ఆచార్యులు హరినాథ్ ఆధ్వర్యంలో చంద్రుడుగా వినిత్యా చౌదరి, మన్మథుడుగా శాన్వి, లక్ష్మీ దేవిగా భార్గవి వేషధారణ చేయగా మరో పది మంది విద్యార్థులు నృత్య ప్రదర్శనతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

పేదల పెన్నిధి సీఎం జగన్



డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

- చంద్రబాబు పాలనంతా చీకటే
- జగనన్న చేసే మంచిని చూసి ఓర్వలేక విషం కక్కుతున్నారు
- 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాలుగన్నరేళ్లలో అందించిన సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. తిరుపతి నగర పరిధిలోని 10, 12 డివిజన్లలో గురువారం ఆయన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయా వార్డుల్లోని ఇంటింటికీ వెళ్లి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అన్న విషయాన్ని ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా దౌవలత్ అనే స్థానిక ముస్లిం మహిళ మాట్లాడుతూ 'జగనన్న లేకపోతే మాకు జీవితమే లేదన్నా. ఆ దేవుడు అందించిన సంక్షేమ పథకాలతోనే జీవిస్తున్నాం. జగనన్నను తప్ప మరొకరిని సీఎంగా ఊహించుకోలేం'అని తెలిపారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్పందిస్తూ దేశ రాజకీయ చరిత్రలోనే ఏ నాయకుడూ నేరుగా సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు నగదు అందించిన దాఖలాలు లేరన్నారు. ప్రతి పేదవాడికీ నేనున్నానంటూ భరోసా కల్పించిన ఏకైక నాయకుడు సీఎం జగన్ అన్నారు. ప్రతి ఇంటా జగనన్న ఉన్నాడన్న భరోసా, ధైర్యంతో పేద ప్రజలు ఎంతో సంతోషంగా జీవిస్తున్నారని తెలిపారు. పేద ప్రజలకు జగనన్న చేస్తున్న సంక్షేమాన్ని చూసి ఓర్వలేక అటు చంద్రబాబు, ఇటు పవన్‌కళ్యాణ్ ఆరోపణలు చేస్తూ విషం కక్కుతున్నారని మండిపడ్డారు. పేదల జీవితాలతో ఆడుకున్న చంద్రబాబుకు ఓట్లు వేస్తారో? ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించిన జగనన్నకు ఓట్లు వేస్తారో? ప్రజలే నిర్ణయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జులు ఆదం సుధాకర్‌రెడ్డి, పడమటి కుమార్, కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌కె.బాబు, ఎస్‌కె.జానీ, కార్పొరేటర్లు దొడ్డారెడ్డి ప్రవళ్లికారెడ్డి, దూది కుమారి, తిరుపతి జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు నల్లాని బాబు, జేసీఎస్ అధ్యక్షుడు దొడ్డారెడ్డి మురళీరెడ్డి, ఉదయగిరి రమేష్ పాల్గొన్నారు.

స్విమ్స్‌లో మాస్టర్ హెల్త్ చెకప్ ప్యాకేజీ

తిరుపతి తుడా: స్విమ్స్‌లో గుండె జబ్బుల (కార్డియక్) రోగుల సౌకర్యార్థం వివిధ రకాల మాస్టర్ హెల్త్ చెకప్ ప్యాకేజీలను అందుబాటులోకి తెచ్చినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో స్విమ్స్ క్లినిక్ ఓపీ విభాగం ద్వారా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నమోదు చేసుకొని ప్యాకేజీ సౌకర్యాన్ని పొందవచ్చని చెప్పారు. ముందుగా ఫోన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు 8333997968 నంబర్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

అవును.. ఆక్రమించుకున్నాం!



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్



గంగులపూడి ఎస్సీ కాలనీకి చెందిన రైతులతో.. మాట్లాడారు.

- సాగు కూడా చేసుకుంటున్నాం
- అప్పుడు ఎందుకు అడగలేదు?
- ఇప్పుడెందుకు వచ్చారు?
- రెవెన్యూ అధికారులను నిలదీసిన టీడీపీ కబ్జారాయుళ్లు

శ్రీకాళహస్తి: 'అవును ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్నాం. సాగు కూడా చేసుకుంటున్నాం. అప్పుడు ఎందుకు అడగలేదు.. ఇప్పుడెందుకు వచ్చారు?' అంటూ టీడీపీ కబ్జారాయుళ్లు తసీల్దార్ ద్వారకనాథ్‌రెడ్డి సాక్షిగా రెవెన్యూ అధికారులను నిలదీశారు. శ్రీకాళహస్తి మండలంలోని గంగలపూడి, ఈండ్రపల్లి గ్రామాల పరిధిలోని గయాలు భూములు వందల ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయి. టీడీపీ హయాంలో బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అండదండలతో ఆ పార్టీ నేతలు 15 నుంచి 20 ఎకరాల చొప్పున ఆక్రమించుకున్నారు. దీనిపై ఇటీవల 'సాక్షి'లో వచ్చిన కథనాలపై స్పందించిన అధికారులు గురువారం గంగలపూడి, ఈండ్రపల్లె తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆక్రమణదారులు మాట్లాడుతూ 'ఇక్కడ మా ఇష్టం వచ్చినంత ఆక్రమించుకొని సాగుచేసుకుంటున్నాం. వాడెవడో చెబితే ఎందుకు వచ్చారు'? అంటూ విరుచుకుపడ్డారు. ఈండ్రపల్లె పొలాల దగ్గర సర్వే నం.402/6లో ఆక్రమణకు గురైందని వచ్చిన కథనాలతో తసీల్దార్, సర్వేయర్లు సురేంద్ర, తిరుమలయ్య, వీఆర్వో మౌనిక బృందం ఆ ప్రాంతంలో పర్యటించింది. స్థానికంగా ఉన్న కొందరితో మాట్లాడారు.

ఆ సర్వే నంబర్లలో ఎంత పొలం ఉంది.. ఎవరెవరి పేరు మీద ఉంది.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎన్ని ఎకరాలు డీకేటీ సాగు చేసుకోవచ్చు తదితర అంశాలపై ఆరాతీశారు. దీనికి స్థానికులు బోడుగు వెంకటేశ్వర్లు, ఆక్కుపల్లి వెంకటేశ్వర్లు అడ్డు చెప్పారు. తమ దగ్గర పాసుపుస్తకాలు, ఇతర పత్రాలు ఉన్నాయని చెప్పారు. ఇదిలావుండగా గతంలో ఎస్సీలకు ఐదు ఎకరాల వరకు ఇచ్చేవారు.. ప్రస్తుతం ఒకటిన్నర నుంచి రెండెకరాలు భూపంపిణీ చేస్తున్నారు.. అయితే స్థానికంగా ఉన్న ఆక్రమణదారుల వద్ద 15, 20 ఎకరాలు ఎలా వచ్చాయి? అనేది ప్రశ్నార్థంగా మారింది. అనంతరం గంగలపూడి ఎస్సీ కాలనీలో తసీల్దార్ పర్యటించగా.. అక్కడ కొన్ని కుటుంబాలకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలను పరిశీలించారు. పొలాలు ఏమయ్యాయి..? అని ప్రశ్నించగా.. దానికి లబ్ధిదారులు స్పందిస్తూ.. తమకు ఇచ్చిన పొలాల్లో మొదట మినుము సాగుచేశామని చెప్పారు. ఆ తర్వాత మామిడి మొక్కలు నాటితే అవి చనిపోయాయని, దీంతో బీడుగా వదిలేశామని చెప్పారు. ఆ తర్వాత తమ కుటుంబాలలోని పురుషులు పది వేలు, 20 వేలకు భూములు వదిలేసి వచ్చేశారని, ఇప్పుడు తమ బిడ్డలు సాగు చేసుకోవడానికి ఒక్క ఎకరా భూమి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాసు పుస్తకాలు తమ దగ్గరే ఉన్నాయన్నారు. ఈ క్రమంలో బ్లాక్ 396 సర్వే నంబర్లను గుర్తించారు. వాటిపై విచారించి సర్వే నిర్వహిస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు.

21న సూళ్లూరుపేటకు సీఎం జగన్

- ఏర్పాట్లను పరిశీలించిన జేసీ



సూళ్లూరుపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని పరిశీలిస్తున్న జేసీ డీకే బాలాజీ

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట నియోజకవర్గానికి ఈనెల 21న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచ్చేయనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను గురువారం తిరుపతి జేసీ కలెక్టర్ డీకే బాలాజీ పరిశీలించారు. సూళ్లూరుపేట, తడ మండలాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. సీఎం హెలీప్యాడ్, బహిరంగ సభ నిర్వహించేందుకు మరికొన్ని స్థలాలను పరిశీలించారు. తడ మండలం మాంబట్టులోని అపాచీ ఫుట్‌వేర్ కంపెనీలో హెలీప్యాడ్, సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని తారకేశ్వరా టెక్స్‌టైల్స్ కంపెనీ ఆవరణలో హెలీప్యాడ్‌ను పరిశీలించారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, చెంగాళమ్మ ఆలయ సమీపంలోని సుమారు 15 ఎకరాల మైదానాలను పరిశీలించారు. సూళ్లూరుపేట పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ సమీపంలో ఎప్పుడో బ్రిటీష్ కాలంలో నిర్మించి శిథిలావస్థకు చేరడంతో నూతనంగా రూ. 35 కోట్లతో నాలుగులేన్ల వంతెనను నిర్మించనున్నారు. ఈ పనులకు భూమిపూజ చేసేందుకు ముఖ్యమంత్రి జగనన్న విచ్చేయనున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో జరిగిన ప్రజాసంకల్పయాత్రలో చెన్నమనాయుడుపేట వద్ద జరిగిన మత్స్యకారుల సదస్సులో జగనన్న ఇచ్చిన మాటను నిలబెట్టుకుని సముద్ర ముఖద్వారాల పూడిక తీత కార్యక్రమానికి సుమారు రూ.248 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ పనులను ప్రారంభించేందుకు ముందుగా ముఖ్యమంత్రి జగనన్న చేతులు మీదు గాభూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహంచనున్నారు.

అందరూ సమష్టిగా పనిచేయాలి

ఈనెల 21న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూళ్లూరుపేట పర్యటనకు విచ్చేయనున్నారని, అధికారయంత్రాంగమంతా సమష్టిగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. ఆయన సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనంలో నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్ష స్థాయి సమావేశం నిర్వహించారు. సూళ్లూరుపేట ఆర్డీవో ఆర్ చంద్రముని, తహసీల్దార్ కన్నంబాక రవికుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ మురళీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు జెట్టి వేణుయాదవ్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనపై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. గురువారం రాత్రి ఆయన మాట్లాడుతూ ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 21న సూళ్లూరుపేట నియోజకవర్గంలో పర్యటించనున్నారని వెల్లడించారు. ఆ మేరకు పకడ్బందీగా చర్యలు చేపట్టాలని వివరించారు. సీఎం పర్యటన సందర్భంగా విధులు కేటాయించిన అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పర్యటన విజయవంతం చేయాలని సూచించారు. తిరుపతి విమానాశ్రయం, సూళ్లూరుపేట హెలీప్యాడ్, బహిరంగ సభ తదితర ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. మత్స్యశాఖ స్టాల్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సమీక్షలో డీఆర్వో పెంచలకిషోర్, లీగల్ సెల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్‌డీవోలు కిరణ్‌కుమార్, శివశంకర్‌రెడ్డి, ప్రొటోకాల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

23 నుంచి విశేష హోమం

తిరుపతి కల్చరల్: హిందూ సనాతన ధర్మప్రచారంలో భాగంగా అలిపిరిలోని సప్త గోప్రదక్షిణ మందిరంలో ఈనెల 23వ తేదీ ఉదయం 9 గంటలకు శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమం ప్రారంభమవుతుందని టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి తెలిపారు. ఈ హోమ వేదికను ఈవో అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సామాన్య భక్తులు హోమం, యాగం నిర్వహించడం చాలా ఖర్చుతో కూడుకున్నదని, భక్తుల కోరిక మేరకు శ్రీవారి పాదాల వద్ద తమ శుభకార్యాలు, విశేష రోజుల్లో స్వామివారి అనుగ్రహం కోసం సంకల్పం చెప్పుకుని యజ్ఞం నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎస్వీ వేదవర్సిటీ ఆధ్వర్యంలో త్వరలో శాశ్వత హోమ వేదికను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ హోమంలో పాల్గొనే గృహస్తులకు ఇద్దరికి టికెట్ ధర రూ.1000గా నిర్ణయించామన్నారు. రోజూ 50 టికెట్లు ఆన్‌లైన్‌లో, మరో 50 టికెట్లు ఆఫ్‌లైన్‌లో, వర్చువల్ టికెట్లు ఎంత మందైనా కొనుగోలు చేసి పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్‌వో నరసింహ కిషోర్, ఎస్వీ వేద వర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివ మూర్తి, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ-2 జగదీశ్వర్‌రెడ్డి, డెప్యూటీ సీఎఫ్ శ్రీనివాస్, ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, డెప్యూటీ ఈవో శాంతి పాల్గొన్నారు.



హోమం ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీటీడీ ఈవో ధర్మారెడ్డి, జేఈవోలు, చీఫ్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్

21న జాబ్ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఉప ఉపాధి కార్యాలయంలో 21వ తేదీ ఉదయం 10గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఆ మేరకు ఉప ఉపాధి అధికారి ఎస్.వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో శ్రీరామ్ చిట్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో మార్కెటింగ్ అండ్ రికవరీ ఉద్యోగాలకు ఆ సంస్థ ప్రతినిధులు ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగానికి ఏదేని డిగ్రీ విద్యార్హత కలిగి, 18 నుంచి 30 ఏళ్లలోపు వయస్సు ఉన్న స్త్రీ, పురుషులు అర్హులని, ఆసక్తి ఉన్న వారు 77023 00292 నంబరులో సంప్రదించాలని కోరారు. అలాగే నిరుద్యోగ అభ్యర్థులు 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సీఎస్.జీఓవి.ఇన్' వెబ్‌సైట్లో పూర్తి వివరాలతో రిజిస్టర్ చేసుకోవాలని ఆయన సూచించారు.

చిట్టమూరుకు చేరిన రాజు యాత్ర


చిట్టమూరులో రాజు

చిట్టమూరు: రాష్ట్రానికి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలని కోరుతూ అడవికొట్టు రాజు చేపట్టిన ద్విచక్ర వాహన యాత్ర గురువారం చిట్టమూరుకు చేరింది. నెల్లూరు జిల్లా, ఉదయగిరి నియోజకవర్గం, జలదంకి మండలం, అన్నవరం గ్రామానికి చెందిన రాజు గత మేలో యాత్ర ప్రారంభించారు. నియోజకవర్గాలు పూర్తయిన తర్వాత మండలాల యాత్ర ప్రారంభించినట్టు వెల్లడించారు. నిరుపేద అయిన తాను 2021లో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్క రూపాయి ఖర్చులేకుండా ఒంగోలులోని ప్రయివేట్ వైద్యశాలలో గుండెకు శస్త్రచికిత్స చేయించుకున్నట్టు వెల్లడించారు. అందుకు కృతజ్ఞతగా రాష్ట్ర వ్యాప్తంగా ద్విచక్ర వాహన యాత్ర చేస్తున్నట్టు రాజు వెల్లడించారు.

పంచమి తీర్థానికి పటిష్ట ఏర్పాట్లు


అధికారులకు సూచనలిస్తున్న టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన నవంబర్ 18వ తేదీన జరగనున్న పంచమి తీర్థం ఏర్పాట్లను గురువారం టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మీడియాతో మాట్లాడుతూ, పంచమి తీర్థం నిర్వహణకు అవసరమైన ఇంజినీరింగ్ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. తిరుపతి నుంచి తిరుచానూరుకు వచ్చే మార్గంలో అయ్యప్పస్వామి గుడి వద్ద, జెడ్పీ హైస్కూల్లో, పూడి మార్గాల్లో దాదాపు 25 వేల మంది వేచి ఉండేలా జర్మన్ షెడ్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు, తిరిగి వెళ్లేందుకు గేట్లు, బ్యారికేడ్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టీటీడీ విజిలెన్స్ సిబ్బంది పోలీసులతో సమన్వయం చేసుకుని కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. పద్మ పుష్కరిణిలో మధ్యాహ్నం 12 గంటలకు చక్రస్నానం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తామన్నారు. షెడ్లలో వేచి ఉన్న భక్తులను చక్రస్నానానికి గంట ముందుగా పుష్కరిణిలోకి అనుమతిస్తామన్నారు. పంచమి తీర్థం ప్రభావం రోజంతా ఉంటుందని, భక్తులు సంయమనంతో వ్యవహరించి పుణ్యస్నానాలు ఆచరించాలని కోరారు. జేఈవోలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిషోర్, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్‌కుమార్, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ –3 సత్యనారాయణ, విద్యుత్ విభాగం ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఆలయ డెప్యూటీ ఈవో గోవింద రాజన్, అదనపు హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ పాల్గొన్నారు.

పంచమీ తీర్థానికి పటిష్ట ఏర్పాట్లు

నవంబర్ 18న నిర్వహించనున్న పంచమి తీర్థానికి టీటీడీ అత్యద్భుతమైన ఏర్పాట్లు చేసిందని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. వాహన సేవలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. పంచమీ తీర్థానికి వచ్చే భక్తులందరికీ అల్పాహారం, తాగునీరు, పాలు, అన్నప్రసాదాలు అందించేందుకు ఏర్పాట్లు చేపట్టినట్టు తెలిపారు. ముందు రోజు రాత్రికే వచ్చే భక్తులకు వేచి ఉండేందుకు మూడు వసతి కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇందులో 25 వేల మంది భక్తులు ఉండవచ్చని చెప్పారు.

అంతరిక్షంలో క్రయోజనిక్ వ్యర్థాల తొలగింపు


లియో ఆర్బిట్‌లో వ్యర్థంగా మిగిలిన క్రయోజనిక్ ఇంజిన్ దశ


క్రయోజనిక్ దశను ఉత్తర పసిఫిక్ మహాసముద్రంలో పడవేస్తున్న గమన పట్టిక

సూళ్లూరుపేట: ఐక్యరాజ్యసమితి, అంతర్–ఏజెన్సీ స్పేస్ డెబ్రిస్ కోఆర్డినేషన్ కమిటీ సిఫార్సుల మేరకు లియో ఆర్బిటర్ (భూమికి దగ్గరగా ఉన్న కక్ష్య)లో ఉన్న రాకెట్ వ్యర్థ పదార్థాలను తొలగించే ప్రక్రియను భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చేపట్టింది. అంతర్జాతీయంగా ఆమోదించిన మార్గదర్శకాలకు కట్టుబడి లియో ఆర్బిట్‌లో ఉన్న వ్యర్థాలన్నింటిని తొలగించింది. ఆమేరకు గురువారం అధికారికంగా తన వెబ్‌సైట్‌లో ప్రకటించింది. ఈ ఏడాది జులై 14న ప్రయోగించిన చంద్రయాన్–3 ప్రయోగంలో మూడో దశలో అమర్చిన క్రయోజనిక్‌దశ (సీ–25)శిథిలాలను గురువారం మధ్యాహ్నం 2.42 గంటలకు భూమి వాతావరణంలోకి తీసుకొచ్చి అంటే రీ ఎంట్రీచేసి ఉత్తర పసిఫిక్ మహాసముద్రంలోకి పడేసే కార్యక్రమాన్ని శాస్త్రవేత్తలు నిర్వహించారు. లియో ఆర్బిట్‌లో రాకెట్ వ్యర్థ పధార్థాలు ఉంటే ఒక దానికొకటి ఢీకొని ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో ఐక్యరాజ్య సమితి, అంతర్–ఏజెన్సీ స్పేస్ డెబ్రిస్ కో ఆర్డినేషన్ కమిటీ రాకెట్ వ్యర్థ పదార్థాలను తొలగించాలని అన్ని అంతరిక్ష ప్రయోగాలు చేసే దేశాలను ఆదేశించింది. ఇందులో ఇస్రో మాత్రమే ముందుగా స్పందించి చంద్రయాన్–3లో ఉపయోగించిన క్రయోజనిక్ ఇంజిన్ వ్యర్థంగా ఉండడంతో దాన్ని తొలగించింది.

తిరుపతిలో దొంగల బీభత్సం




తిరుమల బైపాస్ రోడ్‌లోని ఓ షో రూమ్‌లో దొంగతనాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీం

తిరుపతి క్రైం: తిరుపతి నగరంలో బుధవారం అర్ధ రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. మూసి ఉన్న దుకాణాల షట్టర్లు పగులగొట్టి అందులోని వస్తువులను దోచుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు.. తిరుమల బైపాస్ రోడ్డులోని సామ్‌సంగ్ షోరూమ్ షట్టర్ పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు నాలుగు టీవీలు, మూడు సౌండ్ బార్లు, 8 రిమోట్లు ఎత్తుకెళ్లారు. వీటివిలువ సుమారు రూ.4 లక్షల మేర ఉంటుంది. సీసీ కెమెరాల్లో రికార్డు అవడంతో పోతూ పోతూ హార్డ్ డిస్క్‌ను కూడా తీసుకెళ్లిపోయారు. ఉదయం షాపు తెరిచి ఉండే సరికి దుకాణ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ బాలాజీ కాలనీలో పక్కపక్కనే ఉన్న అలిన్ సోలి, ట్విల్స్ బట్టల షాపులో ఓ షాపులో రూ.1,400, మరో షాపులో రూ.19,000 దోచుకెళ్లారు. దీనిపై బాధ్యతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలు భేష్


పాపానాయుడుపేట పీహెచ్‌సీని పరిశీలిస్తున్న సీఎస్ఎస్ బృందం సభ్యులు

ఏర్పేడు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అద్భుతంగా అందుతున్నాయని కేంద్ర ప్రభుత్వ శాఖ సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్(సీఎస్ఎస్) ఉద్యోగులు కొనియాడారు. ఈ మేరకు వారు సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ఎలా అమలు జరుగుతున్నాయో తెలుసుకునేందుకు గురువారం పాపానాయుడు పంచాయతీలో పర్యటించారు. ఇందులో సీఎస్ఎస్ ఉద్యోగులు అంజూ తన్వార్, అనీషా జైన్, దివ్యాన్సీ త్రిపాఠి, సునీల్‌కుమార్ మీనా, ప్రియాంకమీనా, అరవింద్‌కుమార్ కర్వ ఉన్నారు. భారత్ దర్శన్‌లో భాగంగా పర్యటిస్తున్నట్టు వెల్లడించారు. ముందుగా ఆయుష్మాన్ భారత్ కింద పీహెచ్‌సీలో అమలవుతున్న వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, ఆరోగ్యశ్రీ తదితర పథకాలను పరిశీలించారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తర్వాత అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని, భోజన వివరాలపై ఆరా తీశారు. అనంతరం సచివాలయ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పంచాయతీ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, భూముల రీ సర్వే, దిశ యాప్, బాల్య వివాహాల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలు, వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులను అందించడం, భూసార పరీక్షలు తదితర వివరాలను సిబ్బంది నుంచి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట సర్పంచ్ లలిత, ఎంపీడీఓ గిడ్డయ్య, జూనియర్ ఫ్యాకల్టీ బాల వసుధర, డీఎల్‌పీవో ప్రభురెడ్డి, పంచాయతీ కార్యదర్శి హరికృష్ణ ఉన్నారు.

పర్యవేక్షణ తప్పనిసరి


అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాన్ని క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం విజయవాడ ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి నుంచి వర్చువల్ విధానంలో టూరిజం, జగనన్నకు చెబుదాం, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్, రేషియో, అనీమియా, ఆరోగ్యశ్రీ, మహిళా శిశు సంక్షేమశాఖ, ఏపీఐఐసీ ల్యాండ్స్ తదితర అంశాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి జిల్లా ప్రగతిని ఆయన వివరించారు. నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్షించారు. జాప్యం లేకుండా పథకాల పనితీరును మెరుగుపరచాలని ఆదేశించారు. ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, జిల్లా గ్రామ వార్డు సచివాలయ ఇన్‌చార్జ్ సుశీలాదేవి, సీపీఓ ప్రేమచంద్రారెడ్డి, సర్వశిక్ష అభియాన్ సీఎంఓ సురేష్, డీఎంహెచ్ఓ శ్రీహరి, జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ ఆఫీసర్ తేజస్విని, డీఎల్‌డీఓ ఆదిశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష రాజకీయ యుద్ధానికి సిద్ధం


కట్టా సుధాకర్‌రెడ్డి నివాసంలో నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి రాజ్యలక్ష్మి

నాయుడుపేటటౌన్: వచ్చే ఎన్నికలకు ముందు నుంచే ప్రత్యక్ష రాజకీయ యుద్ధానికి సిద్ధమవుతున్నానని, అందరం జగమంత కుటుంబంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేద్దామని మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మేనకూరు గ్రామంలో గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుదాకర్‌రెడ్డిని పరామర్శించేందుకు వచ్చిన ఆమె అక్కడున్న జెడ్పీటీసీ కట్టా జ్యోతిరెడ్డి, రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయ అడ్వయిడరీ కమిటీ సభ్యులు కట్టా కమాలాకర్‌రెడ్డి, మేనకూరు సర్పంచ్ సురేష్, మాజీ ఎంపీపీ నల్లు కస్తూరయ్య తదితర నాయకులతో సుదీర్ఘంగా చర్చించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదరుమల్లి జనార్దన్‌రెడ్డితో పాటు మంత్రిగా తాను వెంకటగిరి, సూళ్లూరుపేట నియోజవర్గాలతో పాటు అనేక ప్రాంతాల అభివృద్ధికి ఎనలేని కృషిచేసినట్టు గుర్తుచేశారు. ప్రస్తుతం తన కుమారుడు నేదరు మల్లి రామ్‌కుమార్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. రాజకీయ అస్త్రాలను సిద్ధం చేసుకుని ప్రత్యక్ష యుద్ధానికి సిద్ధం కావాలని సూచించారు. ఆమె వెంట నాయకులు కే దామోదర్‌రాజు, కేఎస్ఆర్ సంస్థల మేనేజర్ షేక్, రఫీ, నరేంద్ర యాదవ్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు జవాబుదారిగా సీఎం జగన్ పాలన


డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిట్టమూరు: రాష్ట్రంలో ప్రజలకు జవాబుదారిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. మండల కేంద్రం చిట్టమూరులో జరిగిన వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను తెలియజేసే విధంగా డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైస్ ఎంపీపీ బీవీ రమణయ్య, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటయ్య, కామిరెడ్డి కస్తూర్‌రెడ్డి, చెన్నారెడ్డి బాబురెడ్డి, వంకా రమణయ్య, రమేష్ రెడ్డి, మధుయాదవ్, సుధాకర్‌రెడ్డి, ఓడూరు మనోహర్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, అనీల్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరో ఇద్దరికి గాయాలు


మృతిచెందిన చిన్నరాయుడు , గాయపడిన వ్యక్తులు

ఏర్పేడు: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడిన సంఘటన తిరుపతి బైపాస్ మార్గం తూకివాకం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జికి సమీపంలో గురువారం చోటు చేసుకుంది. గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి కథనం.. తిరుపతి జిల్లా డక్కిలి మండలం, వెల్లుగల్లు గ్రామానికి చెందిన చిన్నరాయుడు(36) తిరుపతి నుంచి స్కూటర్‌లో తన స్వగ్రామానికి వెళుతున్నాడు. తూకివాకం ఫ్లైఓవర్ బ్రిడ్జి దాటుకుని కాస్త ముందుకు వెళ్లగానే ఎదురుగా పుత్తూరు నుంచి తిరుపతి వైపు వస్తున్న మరో స్కూటర్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చిన్నరాయుడుతోపాటుగా మరో స్కూటర్‌లో ఉన్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చిన్నరాయుడు మృతిచెందాడు. కాగా మిగిలిన ఇద్దరూ చికిత్స పొందుతున్నారు. వీరు కాలూరు సమీపంలో గుడారాలు వేసుకుని జీవిస్తున్న సంచార జీవులుగా గుర్తించారు.

భార్య కాపురానికి రాలేదనీ..

తిరుపతి క్రైం: భార్య కాపురానికి రాలేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. అలిపిరి పోలీసుల కథనం.. మధురానగర్‌లో నివాసముంటున్న గిరిబాబు(27) వడమాలపేట మండలం, అప్పలాయగుంటకు చెందిన ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే గిరిబాబు మద్యానికి బానిస కావడంతో ఇరువురి మధ్య తరచూ గొడవలు ఏర్పడేవి. దీంతో మృతుడి భార్య అలిగి పుట్టింటికి వెళ్లిపోయింది. ఎంతకూ రాకపోవడంతో మృతుడు భార్యకు వీడియో కాల్ చేసి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఉరి వేసుకుని తనువుచాలించాడు. దీనిపై అలిపిరి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

యువతి ఆత్మహత్య

ఓజిలి: ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఓ యువతి ఉరి వేసుకుని తనువు చాలించింది. ఈఘటన మండలంలోని కారూరు గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సుబ్రమణ్యం, భార్య లక్ష్మి దంపతుల కుమార్తె శిరీష(18). తన తల్లిదండ్రులు షిర్డీకి వెళ్లడంతో కుమార్తె ఇంటి వద్దే ఉంది. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న ఎస్ఐ దారం ఆదిలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రైలు నుంచి జారిపడి వృద్ధుడి మృతి


గుర్తుతెలియని వృద్ధుడు

నాయుడుపేట టౌన్ : మండల పరిధిలోని బిరదవాడ గ్రామ సమీపంలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. సూళ్లూరుపేట జీఆర్‌పీ ఎస్ఐ శివసొమ్ము కథనం.. బిరదవాడ గ్రామ సమీపం 217 నంబరు రైల్వే బ్రిడ్జి వద్ద ఎగువ మార్గంలో పట్టాలపై గుర్తుతెలిమని సుమారు 65 ఏళ్ల వయస్సు కలిగిన వృద్ధుడు మృతి చెందినట్లు రైల్వే కీమన్ స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించారు. ఆయన సూళ్లూరుపేట జీఆర్‌పీ రైల్వే పోలీస్టేస్‌కు సమాచారం అందించారు. ఎస్ఐతో పాటు హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వద్ద చీరాల నుంచి నాయుడుపేట వరకు తీసుకుని ఉన్న రైల్వే టిక్కెట్‌ను పోలీసులు గుర్తించారు. దీనిని బట్టి విజయవాడ నుంచి చెన్నైకి వెళ్లే పినాకిని ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తూ నాయుడుపేటలో దిగలేక రైలు కదలడంతో భయంతో రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుడు తెలుపు రంగు ఫుల్ హ్యాండ్ షర్టు, మెరున్ రెడ్ నైక్ కంపెనీ డ్రాయర్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుని చేతికి గోల్డ్ కలర్ వాచ్ ధరించి, మెడలో జంజము ఉన్నట్టు గుర్తించారు. ఈ మేరకు గుర్తుతెలియని వృద్ధుడు రైలు నుంచి జారిపడి మృతి చెందినట్లుగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న డీఐఓ రవిరాజు

చిత్తూరు రూరల్: మాతా శిశు మరణాల నివారణకు వైద్య బృందం కలసికట్టుగా కృషి చేయాలని డీఐఓ రవిరాజు సూచించారు. చిత్తూరు నగరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం మాతా శిశు మరణాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. గర్భవతి గుర్తింపులో ఆలస్యం ఉండకూడదన్నారు. ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు విధిగా గర్భవతులను పర్యవేక్షించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ హైరిస్క్ గర్భిణుల విషయంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించి సుఖ ప్రసవం అయ్యేలా చూడాలన్నారు. వైద్యాధికారులు లత తదితరులు పాల్గొన్నారు.

20న ఎస్వీయూ ఈసీ సమావేశం

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 20వ తేదీన జరగనుంది. ఈ సమావేశంలో వర్సిటీ అభివృద్ధి కార్యక్రమాలపై సమూల మార్పులు తీసుకొచ్చేందుకు ఈసీ సభ్యులు ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా డిగ్రీ 1వ, 3వ, 5వ సెమిస్టర్ పరీక్షలను డిసెంబర్ 3వ వారం నుంచి నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ విషయంపైనే రెండు రోజుల క్రితం 'సాక్షి'లో ప్రచురితమైన ఎస్వీయూ అభివృద్ధే అజెండా అనే కథనానికి స్పందించారు.

కెరీర్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ మహిళా అధ్యయన, విస్తరణ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక శ్రీగోవిందరజస్వామి ఆర్ట్స్ కళాశాలలో కెరీర్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయూ, మహిళా వర్సిటీ అధ్యాపకులు విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు, ఇందుకు సంబంధించి ఆన్‌లైన్ వెబ్‌సైట్ల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు, శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సదస్సులో ఆచార్య కె.సుధారాణి, డాక్టర్ జగదీశ్వరి, మహిళా వర్సిటీ పీఆర్‌ఓ డాక్టర్ రజినీ, ఎస్వీయూ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ టి.శ్రీనివాసులు, కామర్స్ విభాగాధిపతి ఉమామహేశ్వరి, పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు.